క్లుప్తంగా

అభివృద్ధి చేస్తున్నాను.. ఆశీర్వదించండి



రోళ్లపాడులో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లి: గతంలో ఎవరూ చేయనివిధంగా రూ.కోట్లు ఖర్చుతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నాను.. రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించి ఆశీర్వదించాలని ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ ప్రజలను కోరారు. ఈ మేరకు రెండోరోజు శనివారం మండలంలోని రోళ్లపాడు, తొమ్మిదోమైలు తండా, వెంకట్యా తండా, బేతంపూడి, గోలియా తండా, తడికలపూడి, తావుర్యా తండా, స్టేషన్ తడికలపూడి, కొత్తతండా(పి), పాతతండా, ప్రెగళ్లపాడు తదితర గ్రామాల్లో పర్యటించారు. వీధులన్నీ కలియదిరిగారు. ఆయా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలను కలిసి రాబోయే ఎన్నికల్లో మద్దతుపై మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కమిటీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న కీర్తి చంద్రికారెడ్డి

ఇల్లెందు: సీనియర్ సిటిజన్లకు చట్టాలపై అవగాహన ఉండాలని ఇల్లెందు కోర్టు న్యాయమూర్తి డి.కీర్తి చంద్రికారెడ్డి అన్నారు. శనివారం ఇల్లెందులోని పెన్షనర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్లకు చట్టాలపై అవగాహన అనే కార్యక్రమంలో ఆమె పలు విషయాలు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఈఓ స్వామీదాసు, న్యాయవాదులు, ఇల్లెందు బార్ అసోసియేషన్ సభ్యులు, మాజీ ఉద్యోగులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు స్పందన..



హాజరైన విద్యార్థులు

కొత్తగూడెంటౌన్: పట్టణంలోని ప్రియదర్శిని డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం టెక్ మహీంద్ర, సైకీస్, హెచ్‌డీఎఫ్‌సీ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కాటేపల్లి నవీన్‌బాబు అన్నారు. 180 మంది విద్యార్థులు పాల్గొనగా మూడు రౌండ్‌లలో పరీక్షలను నిర్వహించి 24 మందిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

రెండో ఏఎన్ఎంల పోరుబాట

- మొదటి ఏఎన్ఎంలకు సమానంగా విధులు
- క్రమబద్ధీకరణకు ఆందోళనలు
- స్పందించని ప్రభుత్వం



ఆస్పత్రిలో వంటావార్పుతో నిరసన తెలియజేస్తున్న రెండో ఏఎన్ఎంలు (ఫైల్)

సుజాతనగర్: సమానపనికి సమాన వేతనాలు ఇవ్వాలంటూ సుమారు 20 రోజులుగా రెండో ఏఎన్ఎంలు విధులను బహిష్కరించి పోరుబాట పట్టారు. తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పదహారేళ్లుగా తక్కువ వేతనాలతో పనిచేస్తున్న రెండో ఏఎన్ఎంలు ప్రభుత్వం అందించే తీపికబురు కోసం ఎదురుచూస్తున్నారు. ఏఎన్ఎంల రిక్రూట్‌మెంట్‌కు ప్రభుత్వం నోటిఫికేషన్‌ను విడుదల చేసిన నేపథ్యంలో ఆందోళన బాటపట్టారు. గత నెల 16 నుంచి విధులను బహిష్కరించి సమ్మె చేస్తున్నారు.

2007లో విధుల్లోకి...

నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా 2007లో రూ.4,200 వేతనాలతో రెండో ఏఎన్ఎంలు విధుల్లో చేరారు. 2017లో ప్రభుత్వం వీరి వేతనాలను రూ.25 వేలకు పెంచింది. సుజాతనగర్ పీహెచ్‌సీ పరిధిలో సుజాతనగర్, వేపలగడ్డ, సీతంపేట, పాత అంజనాపురం, సర్వారం, సింగభూపాలెం, విద్యానగర్-1, విద్యానగర్-2, బాబూక్యాంపు, రాంనగర్, చుంచుపల్లి, ఏబీనగర్ ఇలా.. 12 ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 12 మంది సెకండ్ ఏఎన్ఎంలు విధులు నిర్వహిస్తున్నారు. ప్రాథమిక, ఆరోగ్య ఉపకేంద్రాల్లో మొదటి ఏఎన్ఎంలతో సమానంగా రెండో ఏఎన్ఎంలు పనిచేస్తున్నారు. ఆయా ఉపకేంద్రాల్లో మొదటి ఏఎన్ఎంలతో సమానంగా పనిచేసే తమను రెండో ఏఎన్ఎంలు అంటూ వివక్షకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో మారుమూల పల్లెలకు, ఇంటింటికీ వెళ్లి వైద్యసేవలు అందించామని పేర్కొంటున్నారు.

రెండో ఏఎన్ఎంల విధులు...

ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాల్లో ఒకే పని, ఒకే విద్యార్హతతో మొదటి ఏఎన్ఎంలతో సమానంగా రోజుకూ 16 గంటలు పనిచేస్తున్నారు. ఇమ్యూనైజేషన్, 36 రికార్డులతోపాటు, ఆన్‌లైన్‌లో 18 మొబైల్ యాప్‌లను నిర్వహిస్తున్నారు. గర్భిణులను ఆస్పత్రికి తీసుకెళ్లడం, ప్రసవాలకు రిఫర్ చేయడం, టీకాలు ఇప్పించడం వంటి పనులు చేస్తున్నారు. పోలియో, నులిపురుగుల నివారణతోపాటు ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

రెండో ఏఎన్ఎంల డిమాండ్లు...

రాష్ట్ర ప్రభుత్వం ఏఎన్ఎంల రిక్రూట్‌మెంట్‌కు నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేసినట్లుగానే తమను సైతం రెగ్యులర్ చేయాలని కోరుతున్నారు. పదహారేళ్లుగా అతి తక్కువ వేతనాలకు పనిచేస్తున్నామని, కనీస వేతనం రూ.41వేలు ఇవ్వాలని కోరుతున్నారు. రూ.10లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలని, దురదృష్టవశాత్తూ ఎవరైనా మృతి చెందితే రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుత నోటిఫికేషన్‌తో యాభై ఏళ్లు పూర్తి చేసుకున్న వారు అరవై శాతం మంది ఉన్నారని, ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే ఒకవైపు విధులు నిర్వర్తిస్తూ మరోవైపు పరీక్షలకు ఎలా ప్రిపేర్ అవుతామని ప్రశ్నిస్తున్నారు.



కలెక్టరేట్ వద్ద సమ్మె చేస్తున్న ఏఎన్ఎంలు (ఫైల్)

నిలిచిన వైద్య సేవలు...

గ్రామాల్లో వైద్యసేవలందించే సెకండ్ ఏఎన్ఎంలు సమ్మెలో ఉండటంతో పల్లెల్లో వైద్య సేవలకు బ్రేక్ పడింది. వైద్య సిబ్బంది లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో రోగులకు అవస్థలు తప్పడం లేదు. చిమ్నాతండా, రూప్లాతండా, సింగభూపాలెం, నరసింహాసాగర్, బేతంపూడి, మంగపేట గ్రామాల్లో ప్రస్తుతం జ్వరాలు విజృంభిస్తున్నాయి.

మాతోనే ప్రభుత్వానికి గుర్తింపు..



రెండో ఏఎన్ఎంల సేవలతోనే రాష్ట్ర ప్రభుత్వం అనేక అవార్డులు కైవసం చేసుకుంది. ప్రభుత్వ స్కీం, ఎన్‌హెచ్ఎం అని చెప్పి దాటవేత ధోరణి సరికాదు. మా సమస్యలను గుర్తించి ప్రభుత్వం రెగ్యులర్ చేయాలి.

– గుగులోత్ పద్మజ, రెండో ఏఎన్ఎం

ప్రభుత్వం ఆదుకోవాలి..



మొదటి ఏఎన్ఎంలకు సమానంగా పనిచేస్తూ రెండో ఏఎన్ఎంలుగా అతి తక్కువ వేతనాలు తీసుకుంటున్నాం. ఉద్యోగ భద్రత లేదు. మానవతా దృక్పథంతో ఆలోచించి ప్రభుత్వం మమ్ములను రెగ్యులరైజ్ చేయాలి.

– ఎండీ సజ్జాబేగం, రెండో ఏఎన్ఎం

పోలింగ్ బూత్‌ల పరిశీలన



3 ఇంక్లైన్‌లో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ

చుంచుపల్లి: ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా చుంచుపల్లి మండలంలోని 9 పోలింగ్ బూత్‌లను రెవెన్యూ డివిజనల్ అధికారి శిరీష శనివారం పరిశీలించారు. ఓటరు నమోదు వివరాలను బూత్ లెవెల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెనగడప గ్రామపంచాయతీలో పోలింగ్ బూత్‌లను తనిఖీ చేశారు. గ్రామంలో గృహలక్ష్మి పథకం కొరకు దరఖాస్తు చేసుకున్న నాన్ ఎస్టీలకు సంబంధించిన దరఖాస్తుదారుల గృహాలను సందర్శించారు. ఆమె వెంట ఎంపీఓ గుంటి సత్యనారాయణ, మండల డిప్యూటీ తహసీల్దార్ తిరుమల, సహాయకులు హనుమంతరావు, పాషా, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన

చుంచుపల్లి: భారత ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో శనివారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వినియోగంపై అధికారులు అవగాహన కల్పించారు. నందా తండా, చుంచుపల్లి తండా, విద్యానగర్ కాలనీ గ్రామాల్లో ఈవీఎం మిషన్ ద్వారా ఓటింగ్ వేసే విధానం, ఓటు వేసిన తర్వాత వీవీ ప్యాడ్ల ద్వారా వచ్చే రసీదులపై పంచాయతీ అధికారులు ప్రజలకు వివరించారు. ఈ నెల 8 వరకు మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో రోజుకు మూడు గ్రామ పంచాయతీల చొప్పున అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్‌ జూనియర్ అసిస్టెంట్ రఫీ, బేగం, ఆనంద్, వాసిరెడ్డి మురళి, గుంటి సత్యనారాయణ, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కేజీబీవీలో హెల్త్ క్యాంప్



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీదేవి

జూలూరుపాడు: స్థానిక కేజీబీవీలో శనివారం జూలూరుపాడు ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ ఎం.శ్రీదేవి విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ పద్మజ, వైద్యసిబ్బంది సత్యనారాయణ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న పవన్‌కుమార్

జూలూరుపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో దొంగతనాలు జరగకుండా ఉండేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి పవన్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జూలూరుపాడులో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గుండెపుడి హైస్కూల్‌లో డిజిటల్ టీవీ చోరీ గురైన ఘటన పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు. కార్యక్రమంలో బోడా అభిమిత్ర, పవన్, వికాస్, సూర్యప్రకాష్, వెంకట్, నవదీప్ పాల్గొన్నారు.

మురికివాడల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టండి



మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

పాల్వంచరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని మురికివాడల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించడం లేదు. దీంతో పిచ్చిమొక్కలు పెరిగి దోమలు, ఈగలు పందులు పెరిగిపోతున్నాయని, బ్లీచింగ్ కూడా చల్లడం లేదని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు శనివారం మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి రాపాక రమేష్, బీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు గంధం ప్రసాద్, రంజిత్, మాలోతు ప్రశాంత్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మరపురాని మహానేత వైఎస్ఆర్

దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 14వ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో నిర్వహించారు. నాయకులు వైఎస్ఆర్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. వైఎస్ఆర్ పేద, బడుగు, బలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ సీఎంగా పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు, వృద్ధాప్య, వింతంతు, ఆసరా పింఛన్లు, 104, 108, రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించారన్నారు. రైతులకు ఉచిత విద్యుత్, ఒకే విడతలో రుణమాఫీ చేసిన ఘనత వైఎస్ఆర్‌కే దక్కుతుందన్నారు. పలుచోట్ల అన్నదానం నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్



పాల్వంచ: పూలమాల వేస్తున్న ఎడవల్లి కృష్ణ



జూలూరుపాడు: వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు, అభిమానులు



టేకులపల్లి: సులానగర్‌లో...



ఇల్లెందు: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



సంజయ్‌నగర్‌లో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న కోరం కనకయ్య, పులి సైదులు



ఇల్లెందురూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు



సుజాతనగర్: నివాళులర్పిస్తున్న నాయకులు



కొత్తగూడెంరూరల్: చుంచుపల్లి మండలంలోని పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో...



ఇల్లెందు: డానియేల్ ఆధ్వర్యంలో...

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా

పాల్వంచ: కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఆదేశించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. వనమా మాట్లాడుతూ... అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో మంజూరైన పనులు వెంటనే ప్రారంభించేలా చూడాలని, సగంలో ఉన్న పనులు పూర్తి చేస్తేనే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రోజులు గడపడం కాకుండా, పనుల్లో చురుకుతనం ఉండాలన్నారు. ఆగిపోయిన పనుల్లో ఎక్కడైన లోటుపాట్లు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. తెలంగాణ నగర్‌కు విద్యుత్ సరఫరాపై సంబంధిత అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు రఘు, స్వామి, డీఈలు రవి, మురళీ, ఎన్‌పీడీసీఎల్ డీఈ నందయ్య, ఏడీఈ లక్ష్మణ్, ఏఈలు రాంబాబు, సాహితి పాల్గొన్నారు.

ఆదివాసీలకు ఇచ్చిన హామీల అమలేది..?



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న టీజీఎస్ నాయకులు

టేకులపల్లి: ప్రభుత్వం ఆదివాసీ, గిరిజనులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా నిర్లక్ష్యం చేస్తోందని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగులోత్ రాంచందర్ అన్నారు. ఈ మేరకు శనివారం టీజీఎస్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా టేకులపల్లి ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ దాదాపు 40 లక్షల జనాభా కలిగిన ఆదివాసీ గిరిజనులకు అనేక హామీలు ఇచ్చారని, కానీ అవి అమలుకు నోచుకోలేదని విమర్శించారు. మూడోసారి అధికారం కోసం ప్రయత్నిస్తున్న కేసీఆర్‌కు ఆదివాసీ, గిరిజన ఓట్లు అవసరం లేదా అని ప్రశ్నించారు. కేసీఆర్ హైదరాబాద్‌లో గిరిజన భవన్ ప్రారంభోత్సవంలో ఇచ్చిన హామీ మేరకు ఆదివాసీ బంధు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుగులోత్ శ్రీను, ఐతా శ్రీరాములు, రమేష్, సతీష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన సాధ్యం..

ఇల్లెందు: కాంగ్రెస్ పార్టీ పుట్టుకతోనే పేదలకు అండగా ఉంటోందని, సుస్థిర పాలన కాంగ్రెస్‌కే సాధ్యమని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య అన్నారు. శనివారం పట్టణంలోని 12,13వ వార్డులలో ఇంటింటికి కాంగ్రెస్ ప్రచారం ముమ్మరంగా చేశారు. కనకయ్య మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో దేశానికి కాంగ్రెస్ పాలన అవసరం అన్నారు. కాంగ్రెస్ ఇప్పటికే పేదల కోసం వరంగల్, చేవేళ్ల డిక్లరేషన్లు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. మాజీ మున్సిపల్ చైర్మన్ యదళ్లపల్లి అనసూర్య, జాఫర్, బొల్లి రామారావు, వెంకటనారాయణ, ఇమామ్, నీలపు రమేష్, మడుగు వెంకటలక్ష్మి, బానోతు శారద, మదారమ్మ, చెంచమ్మ, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం చిల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సింగిల్ రోడ్డా..? డబుల్ రోడ్డే కావాలి



నిరసన తెలియజేస్తున్న బోడు పరిసర ప్రాంత ప్రజలు, నాయకులు

టేకులపల్లి: పెట్రాంచెలక స్టేజీ నుంచి మర్రిగూడెం వరకు సింగిల్ రోడ్డు నిర్మాణంపై బోడు పరిసర ప్రాంత ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నాలుగేళ్ల క్రితం ఫారెస్టు శాఖ అడ్డుకోవడంతో నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులకు అటవీ శాఖ అనుమతి ఇస్తుందని ఎదురు చూసిన ప్రజలకు శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన 'అటవీ శాఖ అభ్యంతరం' ప్రత్యేక కథనంతో లాక్యా తండా వద్ద రోడ్డుపైకి వచ్చి నిరసన తెలియజేశారు. టేకులపల్లి, ఇల్లెందు, గుండాల, ఆళ్లపల్లి నాలుగు మండలాలను కలిపే రహదారి నిర్మాణానికి అటవీ శాఖ అడ్డుంకులు చెప్పడం, సింగిల్ రోడ్డుకే అనుమతి ఇవ్వడం సరైంది కాదని వాపోయారు. కలెక్టర్ స్పందించి డబుల్ రోడ్డు నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎట్టి నరసింహారావు, చిలువేరు చంద్రశేఖర్, సత్యం, అనిల్, సమ్మయ్య, ఉపేందర్, సురేష్, తిరుమల, వీరలక్ష్మి, భూషమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందు: అధిక ధరలు, నిరుద్యోగం, ఉపాధి కుదింపునకు వ్యతిరేకంగా గ్రామగ్రామాన సీపీఎం ప్రచారం నిర్వహిస్తోందని మండల కార్యదర్శి ఎస్ఏ నబీ అన్నారు. ప్రధాని మోదీ పాలనలో దేశం అనేక రంగాల్లో తిరోగమనం వైపు పయనిస్తోందన్నారు. పేదల సంక్షేమానికి ప్రవేశపెట్టిన ఏ ఒక్క పథకంతోనైనా వారిని అభివృద్ధి పథంలోకి తీసుకరాలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజావ్యతిరేక విధానాల మీద ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మోహన్‌రావు, శంకర్, నాగరాజు, మహమూద్, పవన్, భద్రూ, రాము, కుమారి, నాగమ్మ, మహేశ్వరి, నాగేశ్వరరావు, వెంకన్న, లక్ష్మి, అమృతం, ఉమ, స్వరూప, సుజాత, రాధమ్మ, శిరోమణి, బుచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న 104 ఉద్యోగులు

కొత్తగూడెంఅర్బన్: 104 ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు రమేష్, జిల్లా కార్యదర్శి దొడ్డ రవి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 104 ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు చాలీచాలని జీతాలు ఇస్తూ, వారిపై అధిక పని భారాన్ని మోపుతూ శ్రమ దోపిడీ చేస్తోందని విమర్శించారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన పీఎఫ్, ఈఎస్ఐలో కూడా ఏజెన్సీవారు దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని, ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వమే నేరుగా ట్రెజరీ ద్వారా జీతాలు చెల్లించాలని, 104 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, 35 సాధారణ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తొలుత ఉద్యోగులు జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసనకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, నాయకులు సాబీర్‌పాషా, ప్రసాద్‌రావులు సంఘీభావం తెలిపారు.

టీచర్లకు పదోన్నతులు కల్పించాలి



అడిషనల్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పాల్వంచ: గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలకు అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని టీఎస్ టీడబ్ల్యూటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాములు నాయక్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లో గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. మాట్లాడుతూ.. తెలంగాణలో పాఠశాల విద్యాశాఖ ఉపాధ్యాయులతో సమానంగా ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న గిరిజన సంక్షేమశాఖ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు బదిలీలు చేపట్టాలని, హైకోర్టు మార్గదర్శకాల ప్రకారం బదిలీల కోసం ఎదురు చూస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ వేదాద్రి, అసోసియేట్ ప్రెసిడెంట్ బయ్యన, ఉపాధ్యక్షులు కెవల్ బాబు, మల్లేశ్, లింగ స్వామి, బాలు తదితరులు పాల్గొన్నారు.